❀ కథానిక




**కదిలే కాలాన్ని మౌనంగా చప్పరించే వర్తమానంకన్నా, కన్రెప్పల మధ్య కదలాడే జ్ఞాపకంలాంటి తీరందాటని అలల్లాంటి కలల్లా విజయం అందించే ఆనందంకన్నా ఓటమి వలన కలిగే దుఃఖమే ఎక్కువకదా.**

వెతుకులాటలో అలిసిపోయిన నా కంటిపాప హోరుగాలిలో పెట్టిన దీపంలా కదలాడ్డం నాకే తెలుస్తోంది.

ఎప్పటిదాకా ఈ వెతుకులాట అంటే ఏమని చెప్పాలి. కాలం గడుస్తున్నకొలదీ క్రమంగా వెదకడంలో వేగం తగ్గిందేమోకానీ, అలుపెరుగని ఈ శరీరంలో ఇంకా ఏం మిగిలుందని.

ఆ 'ఒక్క' ఆశ తప్ప!

అది కూడా మృగ్యం అవుతుందా?

స్పందన అనేది లేనిది నా గతం. అకాలంలో చంద్రగాడ్పులు వీస్తున్న చందంలా వుంది వర్తమానం, ఈ ఉత్పాతాల్ని తట్టుకోలేక సతమతమయ్యేదీ ఈ జీవితమే.

కళ్ళజోడు తీసి చొక్కా కొసలతో తుడిచి మరలా పెట్టుకుంటూ రైల్వేలైన్ మీద అవుటర్ కేబిన్ వరకూ చూశాను. ఏమిటో నా పిచ్చిగానీ, అవుటర్ లైన్ వరకు వచ్చిన రైలు అక్కడే ఆగిపోతుందా ఏమిటి? మరో పావుగంట నిరీక్షణ తర్వాత అప్పటికే అరగంట పైగా ఆలస్యంగా తాడేపల్లిగూడెం వచ్చిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో జనాల్ని తప్పించుకుంటూ నా కోసం నిర్దేశించిన సీట్ కమ్ బెర్త్ దగ్గరకు చేరుకుని చేతిలోని బేగ్‌ను బెర్త్ మీద పెడుతూండగానే ట్రైన్ కదిలింది 'తన' గమ్యం వైపు.

అప్పుడు చూసాను ఎదుట బెర్త్ వైపు. ఒకామె అటు తిరిగి పడుకుని వుంది. వయస్సు ఎంతో తెలియదు. ఆమె కాళ్ళు మాత్రం కనిపిస్తున్నాయి. కాదు, కాదు, ఆ కాళ్ళకున్న...

అవును ఆ పట్టీలే...

కాలం ఆ శరీరం మీద తన ప్రతాపం చూపగలిగింది కానీ, ఆ కాలి పట్టీలు ఏనాటివి.

అవి ఇంకా గుర్తు పెట్టుకోగలగటానికి గల కాలణం, వాటి తయారీలోని నైపుణ్యం మాత్రమే కాదు, మరో ప్రత్యేకమైన అనుబంధం వాటిలో యిమిడి వుంది.

నా జ్ఞాపకాల బొందు పుస్తకంలోని ఆ పేజీ నా రెప్పలపై రెపరెప లాడుతుండగానే... నలుసేదో పడటంతో కంటిముందు ఏదో మసగ్గా యినుప తెరలేవో ఒక్కసారిగా దిగినట్లైంది. కళ్ళజోడు తీసి చొక్కా అంచుతో మరలా తుడిచి, కళ్ళకు అమర్చుకుంటూ చూసాను పై బెర్త్‌లో ఇటుతిరిగి పడుకుని వున్న ఓ కుర్రాణ్ణి, పాతిక లోపుంటాయి. సాధించదలచుకున్న లక్ష్యం తాలూకు వెలుతురు నంతా నింపుకున్నట్టుగా వున్నాడు స్వచ్ఛమైన ముత్యానికి తావి అబ్బినట్లుగా మెరుస్తున్నాడు.

సరిగ్గా ఆ కుర్రాడి వయస్సుంటుందేమో...అప్పుడు...

ఎండిన గుండెను మూల మూలలా తడుముతున్నాయి జ్ఞాపకాలు.

అవునూ, మీ పెళ్ళిళ్ళలో వధూవరులచే ఒకరి చిటికెన వేలిని మరొకరు పట్టుకోమంటారెందుకని? ఆ గాలి హోరులో ఆమె మాటలు దూరంగా తీరం వెంబడి పరుగెత్తే అలలపైబడి రంగుల మాలికల్లా మెరుస్తున్నాయి.


నా భుజం పట్టుకుని కుదుపుతూ "ఏమిటా మౌనం, మా సమక్షంలో" అంది నా గొంతు అనుకరిస్తూ. అన్యమనస్కంగా ఏమని చెప్పానో ఏమో? చప్పన దూరంగా జరిగి కూర్చుంది, గుప్పిళ్ళతో ఇసుక తీసి గాలి వాటుగా తూర్పారబెడుతూ...

ఆ సాయం సంధ్య వెలుతురుకు పూచిన ఆకు సంపంగిలా మెరుస్తోంది ఆమె తనువంతా.

ముంజేతుల కంటిన ఇసుక పుప్పొడి అద్దిన రేక మందారంలా రాలుతోంది ఆమె పాదాల ముందు. 'ప్' కిటికీ లోంచి చూసాను.

వెన్నెల వెలుగులు నాల్గు వైపులా పరచుకుంటున్నాయి. అవును. ఎవరో అన్నట్లు "గతం భవిష్యత్తుకు పునాదే" కానీ వాస్తవంలో అప్పుడూ, ఇప్పుడూ అసమర్థుణ్ణే. నా కళ్ళల్లో సన్నగా కదలాడిన నీటిపొర తెరమీదే ఎదురుగా కూర్చున్నామె కళ్ళల్లోని ఏవో నీలి నీడలు విశాలంగా పరచుకుని ప్రతిబింబిస్తున్నాయి.

కొంచెం చిక్కినట్లుగా అనిపించే శరీరం చేతులకు రంగు వెలసిన మట్టి గాజులు, కాళ్ళకు




– బుర్రా లక్ష్మీనారాయణ

# శూన్యంలోకి

ఆంధ్రజ్యోతి
పవిత్ర వారపత్రిక
1997 దీపావళి
ప్రత్యేక సంచిక

వకరకం రబ్బరు చెప్పులు, చాలా సాదాగా వున్న ఆమె కళ్ళల్లో యిప్పుడు జ్ఞాపకం కొస అందిన రిలీఫ్ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

జ్ఞాపకాల బౌండు పుస్తకంలోని తరువాయి పేజీలను తిప్పడం మానలేదు నా వేళ్ళు, ఎక్కడో మెత్తగా మరెక్కడో గరుగ్గా పేజీలు జారిపడిపోతున్నాయి.



నిజమైన
ప్రేమ
ఆత్మీయతను
ఆరాధనను
మాత్రమే
కోరుకుంటుందా?

"వర్షం వస్తూంది!"

"ఎక్కడా"

తదియనాటి ఆ సాయంత్రం మేడమీద నిలుచుని అన్నాను.

"ఇదిగో ఇక్కడ"

అరచేతిలోని నీటి బొట్టుని చూపిందామె.

కొంటెగా నవ్వుతున్నాయామె పెదాలూ, కళ్ళూనూ.

చప్పున ఆమె వేళ్ళు అందుకొంటూ అరచేతిలోని నీటి బొట్టున్న చోట పెదాలతో అద్దాను.

చేయి లాక్కుని విస్సురుగా వెళ్ళి ఆమె తలొంచుకుని ఆ వైపున కిందకు చూస్తూ నిలబడింది.

ఏమాలోచిస్తోందో ఏమో

"కోపం వచ్చిందా"

"లేదు" అంటూ అంతవరకూ ముందుకున్న జడను ఒక్కసారిగా వెనక్కి విసిరేస్తూ కిందకు వెళ్ళి పోయిందామె.

"ప్చ్"

మళ్ళీ ఆమెకేసి చూసాను, రైలు వేగంగా ప్రయాణిస్తోంది. ఆమె వెల్లకిలా పడుకుని వుంది. కుడిచేయి నుదిటిపై వుంది. అరచేయి బయటకు కనిపిస్తోంది. టైం రెండవుతోంది. గోదావరి యాంత్రికతను, వేగాన్ని నా ఆలోచనలతో నేను గమనించటం లేదు.

అవును. ఆ ఉదయం అయిదు గంటలకనుకుంటా, తలుపుమీద మెల్లగా తట్టిన సవ్వడి, చదువుకుంటున్న నేను ఒక్కంగలో వెళ్ళి తలుపు తీసాను. ఎదురుగా ఆమె.

"ఈ రోజు నా వుట్టిన రోజు తెలుసా" రెప్పలార్పుతూ గుమ్మంలో నిలబడి అంది. పెదాలు నవ్వుతున్నాయి నవ్వగా ఎప్పటిలా.

"అలానా" ఏమనాలో తోచక చప్పన అన్నాను.

"అలానా కాదు, ఏమిస్తావు నాకు" కాన్ఫిడెంట్‌గా అంది. కుడిచేతిలో జడ చివర్లు మెలితిరుగుతున్నాయి.

చుట్టూ చూసాను, ఆమెకిచ్చేందుకు ఏముందాని, ఏమివ్వను నువ్వే చెప్ప నీకేం కావాలో–అన్నాను ఆమె కళ్ళలోకి చూస్తూ.

చెప్తా! కానీ ఇప్పడు కాదు, సాయంత్రం ఆరింటికి ఇంట్లోనే వుండు" అంటూ మెత్తగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయింది.

అనుకున్న సమయానికి నేను ఇంటికి రాలేక పోయాను.

ఎందుకు రాలేక పోయానో ప్చ్...కానీ, ఆ మర్నాడు సాయంత్రం తనే వచ్చింది మేడమీదకు.

"ఏం కోపం వచ్చిందా" అన్నాను నిన్న ఆమె చెప్పిన సమయానికి యింట్లో వుండనందులకు ంజాయిషీగా.

కిటికీలోంచి చూస్తూ ఆమె పిట్టిగోడ దగ్గరే ంచుంది.

'నీ కోసం నేను ఏం తెచ్చానో చూడొచ్చుకదా నామీద కోపం లేకపోతే" అన్నాను ఆల్మైరా




దగ్గరకు వెడుతూ.

అప్పటికి ఆమె గుమ్మం దగ్గరకు వచ్చింది.

రంగు కాయితం చుట్టిన పొట్లాన్ని చిన్న అట్ట పెట్టిలో పెట్టి ఇచ్చాను.

ఆమె ఏం చేస్తోందో చూడలేదు. కానీ మౌనం గానే వుందని అర్థం అయింది, ఏం మాట్లాడటం లేదు కాబట్టి.

"నాకేం అక్కర్లేదు" అంటూ ఆ పెట్టె అక్కడున్న టేబుల్ మీద పెట్టేసి వెళ్ళిపోయింది. తలొంచుకుని మరో పావుగంట తర్వాత అనుకుంటా గాల్లోంచి సన్నగా తేలివస్తున్న మువ్వల శబ్దం చెవులకు సోకింది, టేబుల్ మీద వున్న ఖాళీ అట్టపెట్టె నన్ను వెక్కిరిస్తున్నట్టుగా అనిపించింది.

క్రమంగా ఆ మువ్వల శబ్దం మెట్లెక్కడం, నా వెనగ్గా వచ్చి ఆగడం తెలుస్తూనే వుంది. అయినా తల వెనక్కి తిప్పి చూడలేదు.

"ఇదిగో అమ్మ ఇమ్మంది, ఉదయం మీ గురించి చూసిందట. అప్పుడు ఇల్లు తాళం వేసుందట" అంటూ వచ్చింది.

ఆమెకేసి చూసాను, మొహంలో ఏ భావమూ ప్రత్యేకంగా కనబడలేదు. నాకు కానీ ప్రసన్నంగానే వుందనిపించింది. ఆమె గోరింటాకు చేతులు టేబుల్ మీద తాళం వేస్తున్నాయి, అదే టేబుల్ మీద ఇందాక ఆమె పెట్టిన ఖాళీ అట్టపెట్టె వుంది. పెదాలు సన్నగా హమ్ చేస్తున్నాయి ఏదో పాటని.

"ఏమంటారు దీన్ని" అన్నాను ఆమె మొహంలోకి చూస్తూ.

"షీర్ ఖుర్మా" అంటారు. ఈ రోజు రంజాన్ కదా అంది కళ్ళు చక్రాల్లా తిప్పుతూ.

"అదసరే, నీ చేతులకు వేసుకున్న దాన్ని అన్నాను" చెవులకు వేళ్ళాడే తాళం గుత్తుల్లాంటి జూకాల్ని చూస్తూ.

"ఇదా–మెహందీ" బాగుందా చూడు అంటూ చప్పున ఇటు గెంతి ఆ రెండు చేతులను నా మొహం మీద పెట్టింది. గోరింటాకు వాసన నా ముక్కుపుటాలను తాకింది ఒక్కసారిగా.

"ఆ బాగుంది బాగుందన్నాను" కంగారుగా.

"థేంక్స్ చెప్పు మా అమ్మకు" గలగలా నవ్వుతూ అంది.

ఎందుకూ అన్నట్లు చూసాను. షీర్ ఖుర్మా తాగుతూ.

"ఎందుకేమిటీ, ఇంతందంగా గోరింటాకు పెట్టినందుకూ, అంత చక్కగా పాయసం చేసినందుకూనూ" అంది రాగం తీస్తూ.

ఖాళీ గాజు బౌల్‌ను తీసుకుని మెట్లవరకూ వెళ్ళి మరలా లోపలికి వచ్చి ఓ క్షణం నా ముఖంలోకి చూసి "ఏం లేదులే" అంటూ వెళ్ళిపోయింది శూన్యంలోంచి భారంగా నడుస్తున్నట్లుగా.

ఆమె నడుస్తున్నప్పుడు మెల్లగా వినిపిస్తున్న మువ్వల శబ్దం ఆమె చేష్టలకు భాష్యం చెపుతున్నట్టుగా అనిపించింది. ఆ రాత్రెప్పుడో డైరీ రాద్దామని తీసినప్పుడు అందులో నేను రాయాల్సిన ఆ రోజు పేజీకి మధ్యలో ఆప్ మెహబూబ్ బన్ సక్తేహై!

లేకిన్ ఏక్ బెహతర్ ఖావిం నహీ హోసక్తే! అని రాసుంది.

నాకు తెలుసు ఆమే రాసిందని, కానీ ఆ మాటలకి అర్థం ఏమిటో నాకిప్పటికీ తెలీదు.

"అబ్బా! నువ్వు సిగరెట్ కాలుస్తుంటే నీ ఎర్రటి పెదాల మధ్య తెల్లగా వున్న నేను సుతారంగా కూర్చుని నన్ను నేను కాల్చుకుంటున్నట్టుగా అనిపిస్తుంది" ఆ రోజు మేం ఇద్దరమూ సముద్రపు ఒడ్డున నడుస్తూంటే అందామె.

అనాలోచితంగానే సిగరెట్టుతీసి దూరంగా విసిరేసాను. అదే ఆఖరు.

జ్ఞాపకాల డైరీని మూసేశాయి నా వేళ్ళు. అంతే. ఆ తరువాత ఇప్పటి వరకూ మరలా కనబడలేదు. చుర్రున వేలు కాలేసరికి సిగరెట్టు పడేస్తూ ఆమె కేసి చూసాను, ఆ కళ్ళల్లో తొట్రుబాటు, ఏదో మాట్లాడాలనే సంశయం స్పష్టంగా అగుపించింది.

ఆ రోజు డైరీలో ఆమె రాసిన వాక్యానికిగల అర్థం తెలిసేనాటికే ప్ప్...మాదారులు యీ రైలు పట్టాల్లా వేరయిపోయాయి. ఇదుగో ఇలా కలవటానికే నన్నమాట. నాకు ఇప్పటికీ అర్థంకానిదొక్కటే, అప్పట్నుంచీ ఇలాగే వుండిపోవడానికి గల కారణం ఆమేనా లేక ఆమె నా డైరీలో అలా రాయడం వలనా అని.

జ్ఞాపకాల్లోంచి బయటకు వచ్చేసరికే రైలు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగటమూ, వెనకెనక్కు చూస్తూ ఆమె వెళుతుండటమూ కనిపించింది. భుజం చుట్టూ తన చేతులతో పట్టుకుని నడిపిస్తున్నాడు. ఆమె కూడా వచ్చిన కుర్రవాడు. ఎలా పిలవాలి ఆమెని, కనీసం పేరైనా తెలీకుండా అనిపించింది. మరుక్షణంలో నేనెంత పేదవాడినో ప్రపంచంలోకెల్లా అనిపించింది.

ఆమెని చేరుకోవాలనే ప్రయత్నంలో తడబడుతున్న అడుగులతో గుమ్మం దగ్గరకు వచ్చేసరికి విసురుగా వీచిన గాలి తాకిడికి కంపార్ట్‌మెంట్‌కున్న ఇనుప తలుపు నుదుటికి తగలడం మాత్రం నాకు తెలుసు. అదృశ్య శక్తి ఏదో విసిరేసినట్టు ఎగిరి ప్లాట్‌ఫారం మీద పడింది మాత్రం నేను కాదు. కలలన్నీ కాలిపోయిన కట్టెని కూడా చూడలేని దూరాలు మాత్రం శూన్య లోకాలను తాకుతూ పరచుకున్నాయి సమాంతరంగా. పెదాల మధ్య ఇంకా ఆరని సిగరెట్టు నా ఆశల అసందిగ్ధంగా ఊర్ధ్వ లోకాలను చూస్తూ!"

